# ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



సాయిమధురానగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 8 : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అనేక దేవాయాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గత ప్రభుత్వ ఆలయాల్లో దీప దూప నైవేద్యానికి కూడా నోచుకోని దేవాలయాలు ప్రస్తుతం దేదీప్యమానంగా వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో చెంచు సంక్షేమ సంఘం వద్ద గల శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, సీనియర్ నాయకులు పి.గెల్వయ్యలతో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మకుంట చెంచు సంక్షేమ సంఘం సభ్యుల కోరిక మేరకు దేవాలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ దేవాలయ నిర్మాణ ఖర్చులను తానే భరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చెంచు సంక్షేమ సంఘం నాయకులు బాలకృష్ణ, ఎంకయ్య, హన్మంతు, మహేశ్, చిన్నమైసయ్య, నాగులు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, నాయకులు శ్రీరాములుముదిరాజ్, అఫ్రోజ్‌పటేల్, కోట్ల సంతోష్, టి.రమేశ్, నవీన్‌యాదవ్, లక్ష్మణ్, శ్రీనివాస్, స్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

**పాలమూరు బస్తీ అభివృద్ధికి కృషి..**

బతుకమ్మకుంటలో గల పాలమూరు బస్తీ(వాంబే కాలనీ) అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. వాంబే కాలనీలో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీహాల్ కు డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇక్కడ ఉన్న సగర కులస్తులతో పాటు వాంబే కాలనీలో నివాసముంటున్న వారి కోసం ప్రత్యేకంగా ఈ కమ్యూనిటీహాల్‌ను కట్టిస్తున్నట్లు చెప్పారు. తన ఎమ్మెల్యే బడ్జెట్ నుంచి దీనికి నిధులను కేటాయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పి.గెల్వయ్య, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్‌లతో పాటు ఉప్పర సంఘం నాయకులు పలువురు పాల్గొన్నారు.

**రూ.75లక్షలతో బాగ్‌అంబర్‌పేటలో అభివృద్ధి పనులు..**

- శ్రీ లక్ష్మినర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పలు బస్తీలలో రూ.75 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదివారం ప్రారంభించారు. డివిజన్‌లోని బతుకమ్మకుంట, సాయిమధురానగర్, భరత్‌నగర్ ప్రాంతాలలో డ్రైనేజీ, పైప్‌లైన్ పనులను ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ దిశానిర్దేశంతో అంబర్‌పేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంతో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. దశల వారీగా అన్ని ప్రాంతాల్లో అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నామని, ఈ రోజు రూ.75 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు పి.గెల్వయ్య, శ్రీరాములుముదిరాజ్, అరుణ్‌కుమార్‌రెడ్డి, కనివేట నర్సింగ్‌రావు, నరహరి, కోట్ల సంతోశ్, అఫ్రోజ్‌పటేల్, కాడిగ శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీహరి, శేఖర్, ఎంఎన్ఆర్, మాజీద్, రమేశ్‌ముదిరాజ్, బాలకృష్ణగౌడ్, బాబు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మకుంట చెంచు సంక్షేమ సంఘం వద్ద శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## ఆత్మరక్షణకు కరాటే అవసరం



కలర్ బెల్ట్ ప్రదానోత్సవంలో పాల్గొన్న మహిళా విభాగం అడిషనల్ ఎస్పీ బురహన్‌అలీ, కరాటే మాస్టర్ గోపాల్‌రెడ్డి, కరాటే విద్యార్థులు

కాచిగూడ, అక్టోబర్ 8: ఆత్మరక్షణకు కరాటే ఆయుధంలా పనిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రత విభాగం అడిషనల్ ఎస్పీ బురహన్‌అలీ అన్నారు. జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ గ్రేడింగ్‌లో ఉత్తీర్ణులైన 47 మంది కరాటే విద్యార్థులకు ఆదివారం కరాటే బెల్ట్‌లను ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కరాటే నేర్చుకుంటే ఆత్మస్థైర్యంతో అసాధ్యన్ని సుసాధ్యం చేయవచ్చునని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే కరాటేను నేర్చుకోవడం ద్వారా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. మహిళలు కరాటేను తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఆర్ అకాడమీ వ్యవస్థాపకుడు జీఎస్. గోపాల్‌రెడ్డి, బ్లాక్ బెల్ట్‌లు కరీం, అమృతరెడ్డి, యోగిని, ఘన సంతోషిని, షైనీ, గౌతమ్, నందిని తదితరులు పాల్గొన్నారు.

## అతి తక్కువ ఖర్చుతో విదేశీ వైద్య విద్య

అంబర్‌పేట, అక్టోబర్ 8: నీట్ పరీక్షలో ఉత్తీర్ణులై దేశంలో వైద్య విద్యలో సీటు రాని విద్యార్థులకు విదేశాలలో(కజకిస్తాన్) తక్కువ ఖర్చుతో వైద్య విద్యను అందిస్తున్నామని జీవీకే బ్రదర్స్ ఎడ్యుకేట్ డైరెక్టర్, కాస్పియన్ విశ్వవిద్యాలయం వైస్ డీన్ డాక్టర్ జి.విద్యాకుమార్ అన్నారు. ఆదివారం శివం రోడ్డులో గల ఓ హోటల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో జీవీకే యాన్యువల్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా విద్యాకుమార్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలలో వైద్య విద్య చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు జీవీకే ద్వారా విదేశాల(కజకిస్తాన్)లో పేరుగాంచిన కాస్పియన్ విశ్వవిద్యాలయంలో నాణ్యమైన వైద్య విద్యను అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఈ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులందరికీనాణ్యమైన ఇండియన్ ఫుడ్‌ను కూడా అందిస్తున్నామని చెప్పారు.




వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందిస్తున్న విద్యాకుమార్

## ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులు ప్రదానం



క్విజ్‌లో ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను అందజేస్తున్న అబ్దుల్ అజీజ్ తదితరులు

సైదాబాద్, అక్టోబర్ 8 : సైదాబాద్ డివిజన్ పరిధిలోని శంకేశ్వరబజార్ హనాఫియా మసీదులో మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆదివారం నగదు బహుమతులు, సర్టిఫికెట్స్, మెమోంటోలను అందజేశారు. ఈ క్విజ్ పోటీల్లో 150 మంది హాజరుకాగా, వారిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురిని ఎంపిక చేశారు. 12 ఏండ్ల వయస్సు కలిగిన బాల, బాలికలతో పాటు నుంచి 80 ఏళ్ల వయస్సు కలిగిన వారు క్విజ్‌లో పాల్గొన్నారు. ప్రతి విభాగం నుంచి ముగ్గురు చొప్పున బాల, బాలికలను ఎంపిక చేశారు. మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర, మత విశ్వాసాలపై అబ్జెక్టివ్ టైపులో నిర్వహించిన క్విజ్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురిని ఎంపిక చేశారు. విజేతలకు నగదు బహుమతులతోపాటు సర్టిఫికెట్స్ ప్రశంసాపత్రాలను హనాఫియా మసీదు కమిటీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హనాఫియా మసీదు కమిటీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి ఫైసల్, కోశాధికారి అయాజ్, ఇమ్రాన్, వహీద్ వూ జమా, ఉపాధ్యక్షులు హసన్ బీ సల్వే తదితరులు పాల్గొన్నారు.

## హరిహర క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలకు సన్నాహాలు



సైదాబాద్, అక్టోబర్ 8 : దేవీ శరన్నవరాత్రోత్సవాలకు పురస్కరించుకుని మలక్‌పేట పల్టన్ లోని హరహర మైసమ్మ క్షేత్రంలో ఘనంగా నిర్వహించటానికి ఆలయ కమిటీ సన్నాహాలు చేస్తున్నది. తొమ్మిది రోజులపాటు జరిగే ప్రత్యేక పూజలకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ, చైర్మన్ సూగూరు రమేశ్ తెలిపారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,అక్టోబర్ 8: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన ప్రకారం.. ఫరూక్ నగర్‌కు చెందిన సయ్యద్ హమీద్(58) కూలీ. ఆదివారం సాయంత్రం ఫలక్‌నుమా- బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా అదే సమయంలో వచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## చార్జింగ్ పెట్టిన ఫోన్ మాయం

కాచిగూడ,అక్టోబర్ 8: కాచిగూడ రైల్వేస్టేషన్‌లో చార్జింగ్ పెట్టిన ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం, మంచాల ప్రాంతానికి చెందిన శ్రవణ్‌కుమార్‌రెడ్డి కుమారుడు వెంకట నర్సింహారెడ్డి(55 )ప్రైవేటు ఉద్యోగి. బెంగళూర్‌కు వెళ్లడానికి ఆదివారం కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-2లో తన ఖరీదైన ఫోన్‌ను చార్జింగ్ పెట్టాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఫోన్‌ను దొంగిలించారు. దీంతో కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.